సాక్షి అనకాపల్లి

శుక్రవారం ¦ 5 ¦ మే ¦ 2023



పంటల ఆరోగ్యం చెక్ చేస్తారు..!

పంటలను కాపాడేందుకు ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్(పీహెచ్‌డీసీ)లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. IIలో



పర్యవేక్షణ అవసరం

అభివృద్ధి పనులపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ అవసరమని జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామమూర్తి అన్నారు. IIలో



7న అల్లూరి వందో వర్ధంతి

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వందో వర్ధంతిని ఈ నెల 7న నిర్వహించనున్నట్టు ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. IIలో

గంటా.. పరమశుంఠ!

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు వరమశుంఠలా ప్రవర్తిస్తున్నాడు. ఎలక్షన్ కో పార్టీ మారే ఆయన.. గతంలో తాను మాట్లాడిన మాటలు మరచిపోయి ఇప్పుడు కొత్త కబుర్లు చెబుతున్నాడు. గెలిపించిన ప్రజలను ఇన్నాళ్లు పక్కనపెట్టి.. ఇంట్లోనే కాలక్షేపం చేసిన ఆయనకు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఒక్కసారిగా ప్రజలు గుర్తుకొచ్చేశారు.

సెల్ఫీ చాలెంజ్‌లు, నిత్యం ప్రెస్‌మీట్లు, సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు.. అబ్బో అతని హడావుడి మామూలుగా లేదు.

- అర్థరహిత వ్యాఖ్యలతో పరువు పోగొట్టుకుంటున్న వైనం
- ఏయూ భవనాల 'సెల్ఫీ' గోల్
- స్కూల్ బస్సుల్లోనూ గంజాయి అంటూ టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యాఖ్యలు
- ఇప్పుడు గంజాయికి ఏపీ కేంద్రమంటూ విమర్శలు
- భోగాపురం విమానాశ్రయం విషయంలోనూ అదే ధోరణి
- 12 వేల ఎకరాలు అవసరం లేదన్న జగన్ వ్యాఖ్యలపై పిచ్చిప్రేలాపనలు
- అత్యుత్సాహంతో అభాసుపాలవుతున్న గంటా శ్రీనివాసరావు



వాయించు.. వాయించు..



2009లో ఏయూ కన్వెన్షన్ సెంటర్‌కు భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాటి సీఎం రోశయ్య(ఫైల్)



ఇదే భవనాన్ని టీడీపీ హయాంలో నిర్మించినట్టు సెల్ఫీ దిగి ఫోజులు ఇస్తున్న మాజీ మంత్రి గంటా

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

గెలిపించిన నియోజకవర్గ ప్రజల బాగోగులను గాలికొదిలేసి ఇన్నాళ్లు ఇంటికే పరిమితమైన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు.. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బయటకు వచ్చి చేస్తున్న అర్థరహిత వ్యాఖ్యలతో నవ్వులపాలవుతున్నారు. చంద్రబాబు సెల్ఫీల స్ఫూర్తితో ఆంధ్రా యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ విషయంలో చేసిన సెల్ఫీ ప్రయత్నం కాస్తా సెల్ఫ్‌గోల్‌గా మారింది. రోశయ్య సీఎంగా ఉన్న సమయంలో 2009లో శంకుస్థాపన ప్రాజెక్టును తమ ఖాతాలోకి వేసుకునే ప్రయత్నం చేసిన గంటా తీరు విమర్శలపాలైంది. విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న వ్యక్తి ఇంత సిల్లీగా 'సెల్ఫీ' గోల్ కావడంతో గంటాను సోషల్ మీడియాలో పలువురు ఏకిపారేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మంత్రి హోదాలో ఉండి స్కూల్ బస్సుల్లో గంజాయి తరలిపోతోందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు గంజాయికి ఏపీ కేంద్రంగా మారిపోయిందంటూ గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వంపై చేసిన విమర్శల తీరును అందరూ ఎండగడుతున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేకుండా, భూసేకరణ చేయకుండానే చంద్రబాబు శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ హయాంలో పెట్టుబడులు, మౌలిక సదుపాయాలశాఖ మంత్రిగా అనుభవం ఉన్న గంటా.. అనుమతులు లేకుండా విమానాశ్రయ నిర్మాణం సాధ్యం కాదని తెలిసి కూడా.. చంద్రబాబు చేసిన తప్పును కప్పిపుచ్చుకుంటూ విమర్శలు గుప్పించడంపై మండిపడుతున్నారు.

భోగాపురంలోనూ అదే భజన

భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి టీడీపీ హయాంలో ఏకంగా 12 వేల ఎకరాలు సేకరించాలని నిర్ణయించింది. అయితే విమానాశ్రయ నిర్మాణానికి అంత భూమి అవసరం లేదని.. 2,300 ఎకరాలు చాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే కేంద్ర పౌరవిమానయాన శాఖ అనుమతులు కానీ.. భూసేకరణ ప్రక్రియ చేపట్టకుండానే ఎన్నికల ముందు చంద్రబాబు హడావుడిగా శంకుస్థాపన చేశారు. పైగా భూసేకరణపై రైతులు కోర్టుల్లో కేసులు వేశారు. ఈ కేసులన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. గతంలో మౌలిక సదుపాయాల శాఖ మంత్రిగా చేసిన గంటాకు ఈ విషయాలన్నీ తెలియవా? పార్టీ మారిన వెంటనే అన్ని విషయాలు మర్చిపోతారా? ఎప్పటికప్పుడు ఊసరవెల్లిలా రంగులు మార్చే ఆయన ఇప్పుడు స్వామి భక్తి చూపిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

బాబు ప్రసన్నం కోసం ఆరాటం

ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత విమానాశ్రయం నిర్మాణానికి కేంద్రం నుంచి అనుమతుల కోసం ప్రయత్నించారు. మరోవైపు కోర్టుల్లో ఉన్న కేసుల విషయంలో రైతుల బాధను అర్థం చేసుకుంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ కేసులను కొలిక్కి తీసుకొచ్చారు. బిడ్డింగ్ ద్వారా నిర్మాణ సంస్థను ఎంపిక చేశారు. టీడీపీ హయాంలో విమానాశ్రయ నిర్మాణ సంస్థ ఎంపిక కూడా జరగలేదు. చంద్రబాబు చేసిన శంకుస్థాపన కేవలం ఎన్నికల స్టంట్ అన్న విషయం అందరికీ సులువుగా అర్థమైంది. అయినా గంటా ఇప్పుడే నిద్ర నుంచి లేచి వచ్చి చంద్రబాబును మరీ వెనకేసుకురావడం విమర్శలపాలవుతోంది.

హడావుడితో మళ్లీ తెరపైకి..

2019 సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తర ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ గంటా శ్రీనివాసరావు కిమ్మనకుండా ఇంటికే పరిమితమైపోయారు. కుక్కిన పేను మాదిరిగా ఏం మాట్లాడకుండా మౌనాన్ని ఆశ్రయించారు. ఆయన తీరు పట్ల నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. సొంత పార్టీలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సులువుగా పార్టీలు మారే అలవాటు ఉన్న గంటా వంటి నేతలను ఓ కంట కనిపెట్టి ఉండాలని కూడా నేరుగా చంద్రబాబుకే మాజీ మంత్రి అయ్యన్న కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు. అయితే ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గంటా చేస్తున్న హడావుడి నవ్వులపాలవుతోంది.

ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ

- ఇంటర్ ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ
- గొల్లలపాలెం కస్తూర్బా పాఠశాలను సందర్శించిన డీఈవో



విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ

కె.కోటపాడు : ఇంటర్‌లో ఉత్తీర్ణులు కాని విద్యార్థినులకు సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులు అయ్యేందుకు ప్రత్యేక తరగతులను నిర్వహించే ఏర్పాట్లు చేసినట్టు అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ అన్నారు. గొల్లలపాలెం గ్రామంలో గల కస్తూర్బా పాఠశాలలో మొదటి, ద్వితీయ సంవత్సరంలో ఎంపీహెచ్‌డబ్ల్యూ, ఎంఎల్‌టీ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థినులకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఈ ప్రత్యేక తరగతులను జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ గురువారం ఆకస్మికంగా పరిశీలించారు. గొల్లలపాలెం కస్తూర్బా పాఠశాలలో గొల్లలపాలెం, రొలుగుంట, గొలుగొండ, రాంబిల్లి, చోడవ రం కేజీబీవీల్లో ఉత్తీర్ణులు కాని 73 మంది విద్యార్థినులకు ప్రత్యేక తరగతులను ఇప్పిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ విద్యార్థినులకు సప్లమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యే ఈ నెల 24 వరకూ తరగతులను నిర్వహిస్తూ, వసతి, భోజన సదుపాయాలను కల్పించనున్నట్టు ఆమె తెలిపారు. ప్రతి విద్యార్థి ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకొని తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలని సూచించారు. ఆమె వెంట కేజీబీవీ ప్రిన్సిపాల్ బి.చిన్నమ్మలు, ఎంఈవో టి.మధుమూర్తి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

శ్రీనివాసునికి లక్ష జాజిపూలతో పూజ



శ్రీనివాసునికి లక్ష జాజి పూలతో పూజ చేస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ ప్రతినిధులు

చోడవరం : స్థానిక శ్రీ ఆపదహర శ్రీనివాస క్షేత్రంలో శ్రీ శ్రీనివాసుని కల్యాణోత్సవాలు ఘనంగా జరుగుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు గురువారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీ నివాసుడికి లక్ష జాజి పువ్వులతో ప్రత్యేక పూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శాంతారామాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు స్వామివారి పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పప్పల జయదేవ్, ట్రస్టుబోర్డు చైర్మన్ కందర్ప మాధురీశంకర్, డైరక్టర్లు ప్రవీణ్, పనసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

196 హిందూ ఆలయాలకు నిధులు

- దేవదాయ ధర్మదాయశాఖ డీఈ సైదా



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, డీఈ సైదా, కమిటీ సభ్యులు

నాతవరం : ప్రజల అభీష్టం మేరకు హిందూ దేవాలయాలు నిర్మించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహిస్తుందని దేవదాయ ధర్మదాయ శాఖ డీఈ సైదా అన్నారు. మండలంలో చమ్మచింత గ్రామంలో అంజనేయస్వామి ఆలయం నిర్మాణానికి ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేయడంతో గురువారం ఆలయం నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాతవరం మాకవరపాలెం గొలుగొండ, కొయ్యూరు మండలాల్లో ప్రభుత్వం 198 దేవాలయాలు నిర్మించేందుకు ఆలయానికి రూ.10 లక్షలు చొప్పున మంజూరు చేసిందన్నారు. ఇంతవరకు నాలుగు మండలాల్లో 62 ఆలయాలకు పనులు ప్రారంభించారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆలయాలు నిర్మాణం చేసేందుకు ఆలయ కమిటీ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆలయం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమానికి వైస్ ఎంపీపీ మైనం శ్రీనాగగోపి, సర్పంచ్ వెలకాడ కొండ బాబు, వైస్ సర్పంచ్ అప్పన దివాణం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ హాకీ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారిణులతో కోచ్ సాయి

యలమంచిలి : జాతీయ సబ్ జూనియర్ బాలికల హాకీ పోటీలకు అనకాపల్లి జిల్లా నుంచి ఇద్దరు హాకీ క్రీడాకారిణులు ఎంపికయ్యారని యలమంచిలి హాకీ అసోసియేషన్ కార్యదర్శి కొటారు నరేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒరిస్సాలో 13వ హాకీ ఇండియా సబ్‌జూనియర్ బాలికల పోటీలు ఈ నెల 4వ తేదీ నుంచి జరుగుతున్నాయని, ఈ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు అనకాపల్లి జిల్లా నుంచి శైలజ, రమ్య ఎంపికయ్యారని తెలిపారు. రాష్ట్ర హాకీ జట్టుకు కోడూరు సాయి కోచ్‌గా వ్యవహరించనున్నట్టు తెలిపారు. క్రీడాకారిణులను ఎమ్మెల్యే కన్నబాబురాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి తదితరులు అభినందించారు.

బైక్, కార్ రెంటల్స్ ప్రారంభించిన డీఆర్‌ఎం

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కు రాకపోకలు సాగించే ఇతర ప్రాంతాల ప్రయాణికుల కోసం రిజర్వేషన్ కౌంటర్ వద్ద శ్రీ రాధాకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బైక్ అండ్ కార్ రెంటల్స్‌ను వాల్తేర్ డివిజన్, డీఆర్‌ఎం అనూప్ కుమార్ సత్పతి గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నంలో రోజురోజుకు పర్యాటకం అభివృద్ధి చెందుతున్నందున ఇటువంటి సేవలు ఎంతో అవసరమన్నారు. ప్రయాణికులకు సౌలభ్యంగా రైల్వే స్టేషన్ సమీపంలోనే ఏర్పాటుచేసిన కమర్షియల్ సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం సుధీర్‌కుమార్ గుప్తా, ఇతర అధికారులు, సిబ్బంది, ఎస్‌ఆర్‌కే ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నను సీఎం చేసే బాధ్యత మనదే

- పిసినికాడ బహిరంగ సభలో మంత్రి అమర్‌నాథ్
- రూ.కోటీ 65 లక్షలతో పలు అభివృద్ధిపనులు



పిసినికాడలో బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



కొత్తూరులో సచివాలయ-1 ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యం గ్రామ, వార్డు సచివాలయాలతో సాధ్యపడిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పిసినికాడ పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం గ్రామంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎంగా గెలిపించే బాధ్యత మనందరిపైనా ఉందని పిలుపునిచ్చారు. గ్రామంలో కల్యాణ మండప నిర్మాణానికి స్థలం ఇస్తే, ప్రభుత్వం నుంచి రూ.50 లక్షల నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇచ్చారు. జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.75 లక్షల నిధులతో ఇంటింటికీ తాగునీటి కళాయిలు ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. అర్హత కలిగి, నేటికీ ఇళ్లు లేనివారెవరైనా ఉంటే సచివాలయంలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. జాతీయ రహదారిలో ఉన్న సత్తెమ్మతల్లి అమ్మవారి ఆలయ సమీపంలో కమ్యూనిటీ హాలు పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా? అని సభలో అడగగా ఒక్కో ఇంటికి మూడునాలుగు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పడం ఆనందాన్ని కలిగించిందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో నాలుగేళ్లలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ఉత్తరాంధ్రలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, అదాని డేటా సెంటర్ ఏర్పాటుతో యువతకు ఉపాధి అవకాశాలు, అభివృద్ధి సాధ్యపడుతుందని చెప్పారు. అనంతరం గ్రామంలో రూ.40 లక్షల నిధులతో నిర్మించిన నూతన సచివాలయ భవనాన్ని, మరో రూ.40 లక్షలతో నిర్మించిన డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆయాల నుంచి పదోన్నతి పొందిన ఇద్దరు అంగన్‌వాడీ టీచర్లకు, నూతనంగా భర్తీ అయిన ఇద్దరు ఆయాలకు నియామక పత్రాలను అందించారు. సర్పంచ్ వెంకట రమేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, ఎంపీటీసీ హైమ పాల్గొన్నారు.

కొత్తూరులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొత్తూరు గ్రామంలో రూ.2.12 కోట్లతో నిర్మించిన మూడు సచివాలయాలు, ఒక ఆర్బీకే కేంద్రం, కల్యాణ మండపాన్ని మంత్రి గురువారం ప్రారంభించారు. కొత్తూరు పంచాయతీలో ఏఎంఏఎల్ కళాశాల కూడలి నుంచి ఏలేరు కాలువ మీదుగా మూలపేట గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.1.29 కోట్లు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా వెంకట సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, అధికారులు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం అందించేలా కృషి

- వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్మూర్తి



విలేకర్లతో మాట్లాడుతున్న వైద్యాలయం అభివృద్ధి కమిటీ డైరెక్టర్ రామ్మూర్తి

అనకాపల్లి టౌన్ : పేదలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో గురువారం రాత్రి విలేకర్లతో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ఆస్పత్రి వైద్యం అందిస్తున్నట్టు ఆయన చెప్పారు. 2008లో కొనుగోలు చేసిన సీటీ స్కాన్ కాలం చెల్లిందని, ఒకే స్కానింగ్ పరికరంలో సీటీ, ఎంఆర్‌ఐ స్కాన్ తీసే విధంగా స్కానింగ్ మిషన్‌కు ప్రభుత్వానికి నివేదిక పంపించినట్టు పేర్కొన్నారు. అగ్నిప్రమాదంలో గాయపడిన వారికి చికిత్స కోసం లారెస్ కంపెనీ సహాయంతో వైద్యాలయంలో రూ.3 కోట్ల తో అన్ని సదుపాయాలతో కూడిన ప్రత్యేక వార్డును ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ 60 మంది వైద్యులు 100 మంది రోగులకు సేవలందిస్తున్నారన్నారు. నెలకు 2 వేల మంది గర్భిణులకు స్కానింగ్ చేస్తున్నట్టు తెలిపారు. గతంలో వైద్యాలయానికి ఏ గ్రేడ్ వచ్చిందని, ఇటీవల ఢిల్లీలో ప్రధాని మోదీ చేతుల మీదుగా జిల్లా కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి ఉత్తమ అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. 300 మంది గర్భిణులకు సుఖప్రసవాలు చేస్తున్నామని, అత్యవసర సమయంలో 100 మందికి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.కేన్సర్‌ను తొలి దశలో గుర్తించే పరికరం ద్వారా కేన్సర్ రోగులకు చికిత్స అందిస్తున్నామన్నారు.

ఆరుగురు వైద్యుల కోసం ప్రతిపాదన

మద్యం సేవించే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మద్యం మానేయడానికి రూ.5 వేలతో కూడిన కిట్ అందిస్తున్నట్టు సూపరింటెండెంట్ చెప్పారు. ముగ్గురు గైనిక్ వైద్యులున్నారని, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో మరో ఆరుగురి వైద్యుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపినట్టు చెప్పారు. మత్తు వైద్యుడు ఒకరే ఉన్నారని, మరో ఇద్దరు వైద్యుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. సోమ, బుధవారాల్లో విశాఖ కేజీహెచ్ నుంచి గుండెవ్యాధి నిపుణులు వస్తున్నారని, ప్రతి బుధవారం న్యూరాలజిస్ట్ వస్తున్నారన్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రత్నకుమారి, సూరిశెట్టి రమణ అప్పారావు, మూసూరు శ్రీను, ఆర్‌ఎంవో లక్ష్మణ్ జితానిక్, వైద్యుడు యశ్వంత్ పాల్గొన్నారు.

డిప్లొమాతో కొలువుల జాతర

ఉద్యోగ అవకాశాల కల్పనకు కేరాఫ్‌గా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు మారాయి. పదో తరగతి తరువాత పాలిటెక్నిక్ ద్వారా డిప్లొమాలో చేరిన ప్రతి విద్యార్థిని ఉద్యోగంతో పంపించాలనే లక్ష్యం దిశగా రాష్ట్రంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల పనితీరు మారింది. ఉద్యోగాల కల్పనకు తగిన విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఇటువంటి విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది రాష్ట్ర ప్రభుత్వం. ప్రైవేటు కళాశాలల కన్నా మరింత దీటుగా ప్రభుత్వ సాంకేతిక కళాశాలలు పోటీ పడుతూ విద్యార్థులకు డిప్లొమాతోనే ఉద్యోగం అందిస్తున్నాయి.

- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో విప్లవాత్మక మార్పులు
- రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 90 శాతం విద్యార్థులకు ఉద్యోగాలు
- జిల్లాలో రేబాక, నర్సీపట్నం, చోడవరం కళాశాలల్లో 170 మంది ఎంపిక
- మూడు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 4వేల మందికి ఉద్యోగాలు



అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల



కొలువులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

తుమ్మపాల : ఇటీవల రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా సి.నాగరాణి (ఐఏఎస్)బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులకు 4 వేల పైగా ఉద్యోగాలు కల్పన జరిగింది. పాలిటెక్నిక్ కళాశాలల్లోని విద్యార్థులకు ఉపాధి అవకాశాలతో పాటు కళాశాలల్లో ఆధునిక సాంకేతికత గల ల్యాబ్, కంప్యూటర్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

రేబాక కళాశాలలో 90 శాతం విద్యార్థులకు ఉద్యోగాలు

జిల్లాలో ప్రధాన కేంద్రంగా ఉన్న అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 90 శాతం విద్యార్థులు వివిధ కంపెనీలలో ఉద్యోగాలు పొందారు. సీఈసీలో 2023 ఏడాదికి 63 మంది విద్యార్థుల్లో 58 మంది ఉద్యోగాలు పొందారు. వీరిలో 37 మంది వీల్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ, 08 మంది ఎఫ్‌ట్రోనిక్స్, సమీర్‌లో 05, టెక్నిక్స్‌లో 05, విప్రోలో 02, స్మార్ట్ టీవీ టెక్‌లో ఒకరు చొప్పున ఉద్యోగాలు పొందారు. వీరిలో కొందరు రెండు, మూడు కంపెనీలలో కూడా ఎంపికయ్యారు. ఆయా కంపెనీలతో పాటు డైకిన్, మేదో సర్వో డ్రైవ్స్, హెచ్ఎల్ మేండో కంపెనీలకు పలువురు ఎంపికయ్యారు. వీరితో పాటు డిప్లొమా చివరి సెమిస్టర్‌లో జరిగే ట్రైనింగ్‌లో కూడా విద్యార్థులకు నెలకు రూ.22 వేలు అందించే కంపెనీలతో కళాశాలలు ఒప్పందాలు చేసుకుంటున్నాయి.

ఉన్నత చదువులకు భరోసా కూడా..

డిప్లొమాతో ఉద్యోగం పొందడం మంచి పరిణామం అయినప్పటికీ ఉన్నత చదువులకు ఆటంకం కలుగుతోందంటూ కొందరు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఉద్యోగాలిచ్చే కంపెనీల నుంచి ఉన్నత చదువులకు అవకాశం కల్పించేలా భరోసాతో కూడిన హామీ తీసుకుంటున్నారు. కంపెనీలు పలు ఇంజినీరింగ్ కళాశాలలతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఉద్యోగంతో పాటు ఉన్నత చదువులకు అవకాశం కల్పిస్తున్నారు.

మూడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 170 మంది ఎంపిక

జిల్లాలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు గల అనకాపల్లి మండలం రేబాక, నర్సీపట్టణం, చోడవరం ప్రాంతాల కళాశాలల్లో మొత్తం 170 మంది ఉద్యోగాలకు ఎంపికై శిక్షణ పొందుతున్నారు. రేబాక సాంకేతిక కళాశాల నుంచి- 58 మంది, నర్సీపట్టణం-60, చొడవరం-53...వెరసి మొత్తం 170 మంది ఎంపికయ్యారు.

వీటిలో విప్రో వంటి పెద్ద కంపెనీలతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థ సమీర్‌లో ప్రాజెక్టు అసిస్టెంట్లుగా ఉద్యోగాలు అందించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.


మూడు నెలల్లో వేలాది ఉద్యోగాలు



రాష్ట్ర సాంకేతిక విద్యా విభాగం కమిషనర్ సి.నాగరాణి (ఐఏఎస్) ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. కళాశాల నుంచి ప్రతి విద్యార్థి ఉద్యోగంతో బయటకు వెళ్లే విధంగా ఆమె కృషి చేసున్నారు. గడిచిన మూడు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా అన్ని సాంకేతిక కళాశాలల్లో నాలుగు వేలకు పైగా విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. కళాశాలలకు అత్యాధునిక సాంకేతిక కలిగిన ల్యాబ్‌లను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేశారు. డిప్లొమాతోనే ఉద్యోగాలు పొందే విధంగా తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రోత్సహించాలి. డిప్లొమాతో వచ్చేది చిన్న ఉద్యోగం అనే భావన ముందుగా తల్లిదండ్రుల్లో పోవాలి.

–ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, రేబాక


విప్రోలో ఏడాదికి రూ.5.6 లక్షలు



నేను ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సీఈసీ చివరి సంవత్సరం చదువుతున్నాను. జాబ్ స్కిల్స్‌పై అధ్యాపకులు మంచి ప్రోత్సాహం అందించారు. గత నెలలో జరిగిన నియామకాలకు పరీక్షలు రాశాను. విప్రోలో ఏడాదికి రూ.5.6 లక్షల ప్యాకేజీతో ఉద్యోగ నియామక పత్రం వచ్చింది. త్వరలో ట్రైనింగ్‌కు పిలుస్తామన్నారు.

–బి.భాగ్యశ్రీ ఈసీఈ, చివరి సంవత్సరం, పాలిటెక్నిక్ కళాశాల, రేబాక


కళాశాల నుంచి పూర్తి సహకారం



సొసైటీ ఆఫ్ అప్‌లైడ్ మైక్రోవేవ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, రిసెర్చ్‌లో ప్రాజెక్టు అసిస్టెంట్‌గా ఎంపికయ్యాను. ఏడాదికి రూ.2.5 లక్షలు ప్యాకేజీతో నియామక పత్రం అందించారు. ఈ సంస్థ కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేస్తుంది. మా కళాశాల నుంచి అధ్యాపకులే కంపెనీలతో మాట్లాడి ఇంటర్వ్యూలకు పంపిస్తున్నారు. కళాశాల నుంచి మాకు పూర్తి సహకారం అందిస్తున్నారు.

–జి.జీవన్, ఈసీఈ చివరి సంవత్సరం

రెండు కంపెనీల్లో ఎంపికయ్యాను



ఉద్యోగ అవకాశాలు పొందడానికి కళాశాల నుంచి అన్ని అంశాల్లో నైపుణ్యం పెంపొందిస్తున్నారు. ఇటీవల జరిగిన పలు కంపెనీల ఇంటర్వ్యూల్లో నేను వీల్స్ ఇండియా ప్రైవేటు కంపెనీ రూ.2.3 లక్షలు, ఎఫ్‌ట్రోనిక్స్ కంపెనీలో రూ.2.8 లక్షలు ప్యాకేజీతో ఎంపికయ్యాను.

–షేక్ అబ్దుల్ ఖాదర్, ఈసీఈ

క్లుప్తంగా

శభాష్ వలంటీర్



వర్మకు పింఛను అందిస్తున్న వలంటీర్ ప్రసాద్

మాకవరపాలెం : అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పింఛనుదారులకు నగదు పంపిణీ చేశారు. మండలంలోని బూరుగుపాలెం గ్రామానికి చెందిన పోతల అప్పలనాయుడు విశాఖలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కొండలఅగ్రహారం గ్రామానికి చెందిన దెందుకూరు వర్మ కూడా విశాఖలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం వలంటీర్లు బి.ప్రసాద్, త్రినాథ్‌లు విశాఖ వెళ్లి పింఛను నగదు అందజేశారు.

గ్రావెల్ తవ్వకాలపై దాడులు

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లి శివారు రామారాయుడుపేటలో గురువారం అనధికారికంగా నిర్వహిస్తున్న గ్రావెల్ తవ్వకాలపై రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. రామారాయుడుపేటలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు ఆర్ఐ రమేష్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఇక్కడున్న జేసీబీ, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తవ్వినా, తరలించినా చర్యలు తప్పవని రమేష్ హెచ్చరించారు.

పంటల ఆరోగ్యం చెక్ చేస్తారు..!

చీడపీడలు, తెగుళ్ల నివారణ కోసం మోతాదుకు మించి రసాయన మందులు వినియోగించడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అంతేకాకుండా భూసారం దెబ్బతింటుంది. ఈ పరిస్థితులను మార్పు చేసి రైతులకు అండగా నిలిచేందుకు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పంటలను కాపాడేందుకు ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్(పీహెచ్‌డీసీ)లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ పీహెచ్‌డీసీల్లో మొక్కల డాక్టర్లు మొక్కలకు అనారోగ్యం(తెగుళ్లు) సోకితే వెంటనే డయాగ్నోస్ చేసి తగిన మందులు తగిన మోతాదులో అందించి వాటికి సకాలంలో చికిత్స అందజేస్తారు.

- ప్రతి మండలంలో ప్లాంట్ హెల్త్ డయాగ్నోస్టిక్ సెంటర్
- ఫ్యామిలీ డాక్టర్ తరహాలో పల్లెలకు మొక్కల డాక్టర్
- జిల్లాలో ప్రాథమికంగా 24 కేంద్రాలు గుర్తింపు

అనకాపల్లి రూరల్ : జిల్లా పరిధిలో సుమారు 1.42 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. 1.31 లక్షల ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగులో ఉన్నాయి. పంటలకు తెగుళ్లు సోకినపుడు సమస్య ఏదో తెలియక రైతులు రకరకాల పురుగు మందులు వాడుతూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ నేపథ్యంలో తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడి పెంచడం, చీడ పీడలను సకాలంలో గుర్తించి వాటి నివారణకు పరిష్కార మార్గాలు సూచించడమే లక్ష్యంగా ప్రభుత్వం పీహెచ్‌డీసీలను అందుబాటులోకి తీసుకువస్తోంది. జిల్లాలో 24 మండలాల్లో 24 చోట్ల పీహెచ్‌డీసీల ఏర్పాటు కోసం ఆర్బీకేలను అధికారులు గుర్తించారు.

త్వరలో అందుబాటులోకి

మొదటి దశలో మండలానికి ఒక్కటి చొప్పున పీహెచ్‌డీసీలను ఏర్పాటు చేయనున్నారు. ఇవి వచ్చే ఖరీఫ్ (2023–24) నాటికి రైతులకు అందుబాటులోకి వస్తాయి. ప్రతి మండలంలో సొంత భవనంలో కొనసాగుతున్న రైతు భరోసా కేంద్రాన్ని గుర్తించాలని నిర్ణయించారు. పీహెచ్‌డీసీ డాక్టర్లుగా మొదటి ప్రాధాన్యత కింద అగ్రికల్చర్ ఎమ్మెస్సీ, హార్టీకల్చర్ ఎమ్మెస్సీ చేసిన వారిని ఆర్బీకేల ఇన్‌చార్జ్‌లుగా ఎంపిక చేస్తారు. ఈ అర్హతలు కలిగివారు అందుబాటులో లేకపోతే అగ్రికల్చర్ బీఎస్సీ లేదా హార్టీకల్చర్ బీఎస్సీ చేసిన వారిని ఎంపిక చేస్తారు. వీరు కూడా లేకపోతే అగ్రికల్చర్ లేదా హార్టీకల్చర్‌లో డిప్లొమా చేసిన వారిని ఎంపిక చేస్తారు. వీరి ఎంపికకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.



పరవాడ మండలంలో పీహెచ్‌డీసీగా ఏర్పాటు చేయనున్న వెన్నెలపాలెం ఆర్బీకే

జిల్లాలో 24 పీహెచ్‌డీసీల గుర్తింపు

జిల్లాలో 24 మండలాల్లో ఒక్కో ప్లాంట్ హెల్త్ డయోగ్నోస్టిక్ సెంటర్ (పీహెచ్‌డీసీ)ను ఏర్పాటు చేయడానికి 24 ఆర్బీకేలను గుర్తించారు. మునగపాక మండలంలో ఒంపోలు, కశింకోట మండలంలో ఉగ్గినపాలెం, అనకాపల్లి మండలంలో తగరంపూడి, పరవాడ మండలంలో వెన్నెలపాలెం, సబ్బవరం మండలంలో మొగలిపురం, చోడవరంలో చోడవరం-2, చీడికాడలో తురువోలు, బుచ్చెయ్యపేటలో చింతపాక, దేవరాపల్లిలో తెనుగుబూడి, కె.కోటపాడులో మేడిచెర్ల, యలమంచిలిలో షేకిళ్లపాలెం, రాంబిల్లిలో రాంబిల్లి, ఎస్.రాయవరంలో తిమ్మాపురం-1, అచ్యుతాపురంలో హరిపాలెం, నర్సీపట్నంలో వేములపూడి-2, గొలుగొండలో పాతమల్లంపేట, వి.మాడుగులలో కింతలి వల్లాపురం, రావికమతంలో దొండపూడి, రోలుగుంటలో కొవ్వూరు, పాయకరావుపేటలో సత్యవరం-2, కోటఉరట్లలో సుంకపూర్, నక్కపల్లిలో నక్కపల్లి-1, మాకవరపాలెంలో తామరం, నాతవరంలో ఎంబీ పట్నం ఆర్బీకేల కేంద్రాలను పీహెచ్‌డీసీలుగా ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించి జాబితాను జిల్లా అధికారుల ద్వారా ప్రభుత్వానికి పంపించారు.

త్వరలో శిక్షణ

ప్లాంట్ హెల్త్ డయోగ్నోస్టిక్ సెంటర్‌ల డాక్టర్లకు అనుబంధంగా పొలంబడి ట్రైనర్స్‌లో ఇద్దరు, తోట బడి ట్రైనర్స్‌లో ఇద్దరు ఉంటారు. పొలంబడి ట్రైనర్లలో జిల్లా వనరుల కేంద్రానికి చెందిన ఇద్దరు ఏవోలు, తోటబడి ట్రైనర్స్‌లో ఇద్దరు ఉద్యానవన అధికారులు ఉంటారు. పీహెచ్‌డీసీ డాక్టర్లు, పొలంబడి ట్రైనర్లకు మూడు విడతలగా మూడు వారాలు పాటు శిక్షణ ఇస్తారు. రాంబిల్లి మండలం హరిపురం బి.సి.టి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వీరికి పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వనున్నారు. వ్యవసాయ, ఉద్యానవన పంటలు, మల్బరీ తోటలకు సోకిన చీడ పీడలు వాటి లక్షణాలు నివారణ పద్ధతులపై అవగాహన కల్పిస్తారు. ఈ పంటల్లో ఎటువంటి సమస్య ఉత్పన్నమైనా మండలంలోని పీహెచ్‌డీసీలో నిర్ధారించి పరిష్కారానికి సూచిస్తారు.

రైతులకు ఎంతో మేలు



ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న ప్లాంట్ హెల్త్ డయోగ్నోస్టిక్ సెంటర్లతో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రస్తుతానికి మండలానికి ఒకరు చొప్పున మొక్కల డాక్టర్‌ను నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఆర్బీకేల్లో వీఏఏలు పొలాల్లోకి వెళ్లి పైరు ఆరోగ్యం పరిశీలించేలా ప్రత్యేక బాధ్యతలు చేపడతారు. దీనివల్ల తెగుళ్ల నివారణకు సకాలంలో సూచనలు సలహాలు అందుతాయి. దిగుబడి పెరిగి, సాగు వ్యయం తగ్గుతుంది.

–బి.మోహనరావు, జిల్లా వ్యవసాయాధికారి, అనకాపల్లి

సాగుకు అన్ని విధాలా చేయూత



రాష్ట్ర ప్రభుత్వం సాగుకు అన్ని విధాలా చేయూతనిస్తోంది. తాజాగా మరో అడుగు ముందుకు వేసి మొక్కల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించేలా మొక్కల డాక్టర్‌ను నియమిస్తున్నారు. దీని వల్ల రైతులు సాగు చేసే పంటల చీడ పీడల నివారణకు క్షేత్రస్థాయిలో సరైన సూచనలు, సలహాలు అందడంతోపాటు నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుంది.

–ఎం.రామారావు, ఏడీఏ, అనకాపల్లి

కలప తరలింపుపై డీఎఫ్‌వో విచారణ



మల్లికార్జున్‌ను విచారిస్తున్న డీఎఫ్‌వో రాజారావు

నర్సీపట్నం: కలప తరలింపు విషయంలో వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఎఫ్‌వో రాజారావు గురువారం తన కార్యాలయంలో విచారణ చేపట్టారు. కలప తరలించిన అడ్డతీగలకు చెందిన మల్లికార్జున్‌ను కార్యాలయానికి పిలిపించి విచారించారు. అటవీ సిబ్బంది తనిఖీ చేసి తుమ్మ కలప అని విడిచిపెట్టారు తప్ప, తాను ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని విచారణలో మల్లికార్జున వెల్లడించాడు. తుమ్మ కలప వ్యవసాయ అవసరాలకు తప్ప ఎందుకు పని చేయదని చెప్పాడు. అనంతరం అటవీ సిబ్బందిని కూడా డీఎఫ్‌వో విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తానని ఆయన తెలిపారు.

'స్పందన' వినతులకు తక్షణ పరిష్కారం

రోలుగుంట: స్పందన కార్యక్రమానికి వచ్చిన వినతులపై తక్షణం స్పందించి పరిష్కారం చూపాలని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు, సిబ్బందిని ఆర్డీవో జయరాం ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో స్పందనలో వస్తున్న వినతులు. వాటి పరిష్కారం, సమగ్ర భూసర్వే, తదితర అంశాలపై ఆర్డీవో చర్చించారు. ప్రధానంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ హెచ్.త్రివేణి, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై పర్యవేక్షణ అవసరం

- జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి
- చోడవరం ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీలు

చోడవరం: అభివృద్ధి పనులపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ అవసరమని జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామమూర్తి అన్నారు. చోడవరం మండల పరిషత్ కార్యాలయాలన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయం రికార్డులను పరిశీలించారు. కొందరు సిబ్బంది విధుల్లో లేకపోవడంపై సీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎటువంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరయ్యే సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో చైతన్యను ఆదేశించారు. మండల పరిషత్ నిధులు అభివృద్ధి పనులకు సక్రమంగా వినియోగించాలన్నారు. గ్రామాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆయన సమీక్షించారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఉపాధి హామీ పనులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. వేతనదారులకు పూర్తి స్థాయిలో పని దినాలు కల్పించాలన్నారు. మండల పరిషత్ అధ్యక్షురాలు గాడి కాసు పలు సమస్యలను సీఈవో దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

నిబంధనల మేరకు రోడ్డు విస్తరణ



మాట్లాడుతున్న కమిషనర్ కనకారావు

నర్సీపట్నం : నిబంధనల ప్రకారం రోడ్డు విస్తరణ చేపడుతున్నామని మున్సిపల్ కమిషనర్ కె.కనకారావు తెలిపారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి చైర్మన్ తమరాన అప్పలనాయుడు అధ్యక్షతన రోడ్డు విస్తరణపై భవన, స్థల యాజమానులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వంద అడుగులు కాకుండా 80 అడుగులకు తగ్గించి విస్తరిస్తే పెద్దగా నష్టం జరగదని యజమానులు అభిప్రాయపడ్డారు. ఆమోదం పొందిన రోడ్డు డెవలప్‌మెంట్ ప్లాన్ ప్రకారం వంద అడుగుల కంటే తగ్గించడానికి అవకాశం లేదని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజా అవసరాల దృష్ట్యా మెయిన్ రోడ్డు విస్తరణకు యజమానులు సహకరించాలని కోరారు. భవనాలు, స్థలాలు కోల్పోతున్న బాధితులకు టీడీఆర్ బాండ్ల రూపంలో నష్టపరిహారం చెల్లిస్తున్నామన్నారు. ప్లాన్‌కు విరుద్ధంగా మార్కింగ్ ఇచ్చినట్లయితే టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. రోడ్డు విస్తరణకు సంబంధించిన ప్లాన్‌పై యజమానులకు కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. మరోసారి సమావేశం నిర్వహించి యజమానుల సందేహాలను నివృత్తి చేస్తామని కమిషనర్ తెలిపారు. చైర్మన్ అప్పలనాయుడు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ బాధితులకు న్యాయం చేసేందుకు ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ చర్యలు తీసుకుంటున్నారన్నారు.

సింహగిరిపై భారీ బందోబస్తు

వైశాఖ పౌర్ణమికి ఏర్పాట్లు

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం వంద మంది పోలీసులతో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వైశాఖ పౌర్ణమికి సింహాచలేశుడి దర్శనానికి భారీ ఎత్తున భక్తులు తరలివస్తుండటంతో ఈ ఏడాది కొండదిగువ వరాహ పుష్కరిణి వద్ద, సింహగిరిపై పోలీసులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహ మూర్తి ఆధ్వర్యంలో ఆరుగురు సీఐలు, ఎనిమిది మంది ఎస్ఐలు, వంద మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రానికే పోలీసులు సింహాచలం చేరుకోగా, వారికి గోపాలపట్నం సీఐ నరసింహారావు డ్యూటీలు కేటాయించారు.

సాయంత్రానికే చేరుకున్న భక్తులు

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పలువురు భక్తులు గురువారం సాయంత్రానికే సింహాచలం చేరుకున్నారు. వీరంతా శుక్రవారం ఉదయం వరాహ పుష్కరిణిలో స్నానమాచరించి సింహగిరికి తరలివెళ్తారు.

నేడు రెండో విడత చందనం సమర్పణ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం తెల్లవారుజామున రెండో విడత చందనం సమర్పణ జరగనుంది. ఇప్పటికే మూడు మణుగుల చందనంలో పలు సుగంధ ద్రవ్యాలను కలిపి సమర్పణకు సిద్ధం చేశారు. తెల్లవారుజామున సుప్రభాతసేవ అనంతరం స్వామికి చందనం సమర్పిస్తారు.

కూలి రేట్లపై ముఠా కార్మికులతో చర్చలు



సమావేశంలో పాల్గొన్న అధికారులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : కూలి రేట్లు చెల్లించడంలో ఫార్మా పరిశ్రమలు ఒకే విధానాన్ని పాటించాలని అనకాపల్లి జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ సూచించారు. అచ్యుతాపురం సెజ్ పరిధిలోని ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు, ముఠా కార్మికులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. కార్మిక శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించిన ఈ సమావేశంలో కూలి రేట్ల గురించి సమీక్షించారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సువర్ణ, ఐలా డిప్యూటీ మేనేజర్ కిశోర్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు దేవరాపల్లి ఎస్ఐ డి. నాగేంద్ర తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాశీపురం నూకాలమ్మ ఆలయం వద్ద ఆనందపురం నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం, దేవరాపల్లి నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం సాయంత్రం ఎదురెదురుగా ఢీకొన్న సంగతి విదితమే ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం, చినబత్తివలస గ్రామానికి చెందిల లండ భాస్కరరావు(30) తీవ్రంగా గాయపడ్డారు. కుడి కాలు, కుడి చెయ్యి విరిగిపోవడంతో పాటు తలకు తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రుడిని 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మరణించినట్లు స్థానిక ఎస్ఐ డి. నాగేంద్ర తెలిపారు. మృతుడి తండ్రి లండ అప్పలగురువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని అతడి కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు. మేనత్త ఇంట్లో వివాహ వేడుక పెళ్లి కార్డులను జుత్తాడ పాలెంలో బంధుమిత్రులకు పంచేందుకు వచ్చిన తన కుమారుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మృతిచెందాడని, మృతుడి తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి



మృతుడు అప్పలనాయుడు

మునగపాక : మండలంలోని గంటవానిపాలెం సమీపంలోని వ్యవసాయ కమతాల వద్ద రైతు విద్యుత్ షాక్‌కు గురై గురువారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. అచ్యుతాపురం మండలం కాశీపాలెం గ్రామానికి చెందిన పీలా అప్పలనాయుడు(54) వ్యవసాయం సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అప్పలనాయుడుకు మునగపాక మండలం గంటవానిపాలెం వద్ద వ్యవసాయ భూమి ఉంది. ఎప్పటిలాగానే గురువారం పొలం పనులు చూసేందుకు వెళ్లిన అప్పలనాయుడు విద్యుత్ స్తంభానికి పక్కనే ఉన్న స్టే వైర్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న కుటుంబ సభ్యులు అప్పలనాయుడు మృతదేహాన్ని చూసి కన్నీటిపర్యంతమయ్యారు. ఎస్ఐ మహమ్మద్ ఆలీ సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేశారు. మృతుడు అప్పలనాయుడుకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబానికి జీవనాధారం అయిన అప్పలనాయుడు మృతితో కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తండ్రి అక్కునాయుడుకు తలకొరివి పెట్టేందుకు సిద్ధమవుతున్న లక్ష్మి

మాడుగుల రూరల్: తండ్రికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది ఓ కుమార్తె. మండలంలో ముకుందపురానికి చెందిన బాలిబోయిన అక్కునాయుడు(65) బుధవారం రాత్రి అకస్మాత్తుగా మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలకు వివాహమైంది. కుమారులు లేకపోవడంతో పెద్ద కుమార్తె లక్ష్మి గురువారం జరిగిన అంత్యక్రియల్లో పాల్గొని తండ్రికి తలకొరివి పెట్టింది. ఆమెను గ్రామస్తులు అభినందించారు.

7న అల్లూరి వందో వర్ధంతి

- గొలుగొండలో అల్లూరి స్మారక పార్కు అప్పగించాలని సీఎస్‌కు లేఖ
- పాడేరు బైపాస్‌కు రూ.350 కోట్లు
- రాజేంద్రపాలెంలో ఏర్పాట్లు పరిశీలించిన ఐటీడీఏ పీవో

కొయ్యూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వందో వర్ధంతిని ఈ నెల 7న నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టామని ఐటీడీఏ పీవో అభిషేక్ తెలిపారు. ఆయన గురువారం రాజేంద్రపాలెంలో అల్లూరి స్మారక పార్కును సందర్శించారు. వర్ధంతి నిర్వహణపై వివిధ శాఖల అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. కిందటి ఏడాది ఆజాదీకా అమృత్ మహోత్సవంలో భాగంగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర ఆవిష్కరించిన గాం గంటన్నదొర, మల్లు దొర, అల్లూరి విగ్రహాల ప్రాంతాన్ని సుందరంగా తయారు చేయాలని ఆదేశించారు. వేదిక వద్ద చేపట్టాల్సిన చర్యలను వివరించారు. పార్కును సుందరంగా తయారు చేయాలన్నారు. దీనికి అవసరమైన సహకారం అందిస్తామన్నారు. అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలంలో అల్లూరి స్మారక పార్కును అల్లూరి జిల్లాకు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్ ద్వారా ముఖ్య కార్యదర్శికి లేఖ రాస్తామన్నారు.



అల్లూరి పార్కులో సభ నిర్వహణపై స్కెచ్ వేస్తున్న పీవో

రెండో దఫా 2,161 మందికి సికెల్‌సెల్, తలసేమియా పరీక్షలు

పాడేరు డివిజన్‌లో 53,360 మంది పిల్లలకు సికెల్ సెల్ ఎనీమియా, తలసేమియా పరీక్షలను ప్రాథమికంగా నిర్వహించామని ఐటీడీఏ పీవో వెల్లడించారు. వారిలో 2,161 మందికి ఉన్నట్టుగా రెండో దఫా పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. కొయ్యూరు తహసీల్దారు కార్యాలయంలో ఆయన గురువారం మాట్లాడారు. వ్యాధి నిర్ధారణ అయితే, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల కింద నెలకు రూ.10 వేల పింఛన్ వస్తుందన్నారు. మన్యంలో నిర్మిస్తున్న జాతీయ రహదారి 516/ఈకి సంబంధించి గ్రామాల్లోనే కోర్టులు ఏర్పాటు చేయడంతో చాలా వరకు వివాదాలు పరిష్కారమయ్యాయని తెలిపారు. ఇప్పటి వరకు భూములు, ఇళ్లు కోల్పోయిన వారి ఖాతాల్లో రూ.50 కోట్లు జమ చేశామన్నారు. 13 కిలోమీటర్ల మేర పాడేరు బైపాస్‌కు సంబంధించి రూ.350 కోట్లు మంజూరయ్యాయన్నారు. చింతపల్లి, అరకు, హుకుంపేటలోనూ బైపాస్ వస్తుందన్నారు. గ్రీన్ కార్పొరేషన్ నుంచి వెయ్యి మొక్కలు తీసుకుని పద్మాపురం, చాపరాయి, కొత్తవలస ప్రాంతాల్లో వేస్తామన్నారు. కొయ్యూరు మండలంలో గాదేగుమ్మి జలపాతంలో ప్రమాదాల నివారణకు ఇనుప కంచెను ఏర్పాటు చేస్తామన్నారు. ఇదే మండలంలో జీడి పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. తద్వారా రైతులకు మెరుగైన ఆదాయం వస్తుందన్నారు. రావణాపల్లిలో ఏర్పాటైన జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను, డౌనూరులో మూతపడిన న్యాప్‌కిన్‌ల తయారీ కేంద్రాలను తెరిపిస్తామన్నారు. కాకరపాడు గురుకుల జూనియర్ కళాశాలలో బాలికలకు సీట్లు ఇచ్చేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటర్ పరీక్షల ఫలితాల్లో తక్కువ మంది పాసైన కళాశాలల ప్రిన్సిపాళ్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. మారికవలసలో ఫలితాలు బాగున్నాయని, అక్కడ ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం ఈఈ డీవీఆర్ఎం రాజు, చింతపల్లి డీఈ చాణక్య, జేఈ రామకృష్ణ, ఎంపీపీ బడుగు రమేష్, ఎంపీడీవో మేరీరోజ్, తహసీల్దారు తిరుమలరావు, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు, సర్పంచ్ పి. సింహాచలం, బీఎస్ఎన్ఎల్ సలహా కమిటీ సభ్యుడు నర్సి కిరణ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

హెల్మెట్ లేకుంటే చర్యలు



వాహన చోదకులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీను

అనకాపల్లిటౌన్ : ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్‌ను తప్పక ధరించాలని ట్రాఫిక్ ఎస్ఐ శ్రీను సూచించారు. స్థానిక పూడిమడక రహదారిలో గురువారం ఆయన వాహన చోదకులతో మాట్లాడారు. సెల్‌ఫోన్, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రతి ఒక్కరిలో అతి ముఖ్యమైన తల భాగానికి రక్షణగా, హెల్మెట్ ధరించాలని కోరారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, వాహన చోదకులు పాల్గొన్నారు.

ఘనంగా కొత్తమహాలక్ష్మి పండగ



ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

మునగపాక : స్థానికంగా పేరుగాంచిన పేటకట్టు కొత్తమహాలక్ష్మి అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి సంబంధిత సంఘ సభ్యులు ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ భక్తులు భారీ ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని, అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.

7న యలమంచిలిలో జనసేన పార్టీ కార్యాలయం

అనకాపల్లిటౌన్ : యలమంచిలి నియోజకవర్గంలో ఈ నెల 7న జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి భాస్కరరావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రారంభోత్సవ కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి, యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి సుందరపు విజయ్‌కుమార్, చోడవరం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, పార్టీ నాయకులు రాయపురెడ్డి కృష్ణ, మోటూరి సన్యాసినాయుడు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 221 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	--	--
మొదటి రకం	4,600	4,740
రెండో రకం	3,850	4,300
మూడో రకం	3,800	3,820

అనకాపల్లి సినిమాలు

ఉగ్రం	రాజా
రామబాణం	సత్యనారాయణ స్క్రీన్-1
	సత్యనారాయణ స్క్రీన్-2
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ (తెలుగు 3డి)	
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
రుద్రుడు	వెంకటేశ్వర
రావణాసుర	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-27 యూనిట్లు , ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



గడప గడపకు మన ప్రభుత్వంలో స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



తేగాడలో డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి అమర్‌నాథ్
- రూ.50 లక్షలతో అభివృద్ధి పథకాల ప్రారంభం

కశింకోట : దేశంలో మరే రాష్ట్రంలో లేనంతగా అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కొనియాడారు. మళ్లీ సీఎంగా జగన్ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి మరిన్ని పథకాలు అమలు చేస్తారన్నారు. మండలంలోని తేగాడ గ్రామంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై రూపొందించిన బ్రోచర్లను అందించారు. సంక్షేమ లబ్ధిని కుటుంబాల వారీగా వివరించారు. స్థానిక సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల స్థలాలు, పింఛన్లు అందించాలని కొందరు కోరగా అందుకు చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందిస్తోన్న లబ్ధిని తెలుసుకునేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు అందించాలని కోరారు.

ఈ సందర్భంగా రూ.20 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డును మంత్రి ప్రారంభించారు. రూ.15 లక్షలతో నిర్మించిన డ్రైనేజీలు, రూ.18.50 లక్షలతో చేపట్టిన ఇంటింటి కుళాయి పథకాన్ని ఆయన ప్రారంభించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్‌కు అడుగడుగునా విశేష ఆదరణ లభించింది. మహిళలు మంగళ హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు తుంపాల మంగతాయారు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు నీటిపల్లి దివాకర్, అధికారులు, సచివాలయ సిబ్బంది, స్థానిక పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై మంత్రి అమర్‌నాథ్



ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట : మండలంలోని తేగాడ గ్రామంలో రైతు భరోసా కేంద్రం ద్వారా రైతు గ్రూపునకు మంజూరైన ట్రాక్టర్‌ను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఆయన, అక్కడే ఏర్పాటు చేసిన ట్రాక్టర్‌పై కూర్చొని పరిశీలించారు. దీన్ని త్వరలో కస్టమ్ హైరింగ్ కేంద్రం ద్వారా రైతుల అవసరాలకు వినియోగించనున్నారు.

పేరంటాలపాలెంలో 'గడప గడపకు' నేడు

కశింకోట : మండలంలోని పేరంటాలపాలెం గ్రామ పంచాయతీలో శుక్రవారం ఉదయం 8 గంటలకు ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం ప్రారంభంకానున్నట్టు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పాల్గొంటారని పేర్కొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును, స్థానిక సమస్యలను తెలుసుకుంటారన్నారు.

7న వినాయక పసిడి కలశ ప్రతిష్టాపన

అనకాపల్లిటౌన్ : గాంధీనగరం విద్యుత్‌నగర్ బాలా త్రిపురసుందరి యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న వరసిద్ధి వినాయక పసిడి కలశ ప్రతిష్టాపన చేయనున్నట్టు సంఘ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు తొలి వేకువ నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

రక్షణ రంగంలో అపార ఉద్యోగావకాశాలు



విద్యార్థులకు పీపీటీ ద్వారా అవగాహన కల్పిస్తున్న ఆర్మీ అధికారి రంధ్వ

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం రక్షణ రంగంలో లభించే ఉద్యోగ అవకాశాలు, ఆయా ఉద్యోగ అవకాశాలకు నేర్చుకోవాల్సిన ఆర్మీ అధికారి మేజర్ రంధ్వ గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. అగ్నిపథ్ ర్యాలీకి హాజరయ్యే విద్యార్థులకు, విద్యార్హతను బట్టి లభించే బోనస్ మార్కులను వివరించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఇండియన్ నేవల్ అకాడమీలో ప్రవేశాలు, ఆర్మీ నర్సింగ్ సర్వీస్ వంటి అవకాశాలపై అవగాహన కల్పించారు. ఎన్‌సీసీ అధికారి మణికంఠ, ప్రశాంతి విద్యా సంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రాహ్మణి ముత్యాలమ్మ పండగ



శ్రీ బ్రాహ్మణి ముత్యాలమ్మను దర్శించుకున్న గ్రామ పెద్దలు

పరవాడ: మండల కేంద్రమైన పరవాడ గ్రామంలో కొలువుదీరిన బ్రాహ్మణి ముత్యాలమ్మ పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు. ఉత్సవ కమిటీ భక్తులకు ఇబ్బంది లేకుండా షామియానాలు, తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదాలను ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు. రాత్రికి అమ్మవారిని డప్పు వాయిద్యాలు, నేలడ్యాన్సులు, చిడతలు, తప్పెటగుళ్లు, సాముగరిడీలతో పుర వీధుల్లో ఊరేగించారు. రాత్రికి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం భారీ బాణ సంచాకాల్పులతో అమ్మవారి అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

అమ్మవారిని దర్శించుకున్న నాయకులు

ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు తో పాటు మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, ఆలయ కమిటీ ప్రతినిధి పైల రామచంద్రరావు, తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు.

ప్రజల సహకారంతో మునగపాక అభివృద్ధి



తుప్పల తొలగింపును పరిశీలిస్తున్న సర్పంచ్

మునగపాక : ప్రజల సహకారంతో మునగపాక గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. గురువారం మునగపాక బీసీ కాలనీ పరిధిలో తుప్పల తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు కూడా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు.

ఉపాధి కూలీలతో స్వచ్ఛ సంకల్పం



పాములవాకలో పిచ్చిమొక్కలు తొలగిస్తున్న ఉపాధి కూలీలు

కోటవురట్ల : స్వచ్ఛ సంకల్పంలో మేము సైతం అంటూ ఉపాధి కూలీలు ముందుకొచ్చారు. పాములవాకలో ప్రభుత్వ కార్యాలయాలు, మెయిన్‌రోడ్డు, పాఠశాలలు, వీధుల్లో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. దీంతో పాములు, విషపురుగులకు నిలయంగా మారాయి. ఈ సమస్యను మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కిల్లాడ శ్రీనివాసరావు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి ఆదేశాలతో గురువారం ఉపాధి హామీ పథకం కూలీలు జంగిల్ క్లియరెన్స్‌లో పాల్గొన్నారు. పిచ్చి మొక్కలు తొలగించి పారిశుధ్య పనులు చేపట్టారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న స్వచ్ఛ సంకల్పానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. యువకులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి ఎవరి పరిధిలో వారు పారిశుధ్య మెరుగుకు సహకరించాల్సిందిగా కోరారు.

రేపు సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం



నాయుడుపాలెంలో కొలువుదీరిన సిద్ధి వినాయకుడు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెంలో కొలువైన సిద్ధి వినాయక ఆలయ 5వ వార్షికోత్సవాన్ని ఈనెల 6న వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని ఉత్సవ కమిటీ ప్రతినిధి కూండ్రపు మధు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 7 నుంచి ఆలయంలో వేదపండితులతో గణపతి హోమం , అభిషేక పూజలు జరుగుతాయని చెప్పారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భారీ అన్నస మారాధన ఏర్పాటు చేశామని తెలిపారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని ఉత్సవ కమిటీ ప్రతినిధి మధు కోరారు.

వారపు సంతకు మామిడి జోష్

- భారీ ధర పలికిన బంగినపల్లి
- పెరిగిన కూరగాయల ధరలు
- మచ్చుకైనా దొరకని అల్లం

కశింకోట : స్థానిక వారపు సంతలో గురువారం మామిడి పండ్లకు డిమాండ్ పెరిగింది. బంగినపల్లి పెద్ద సైజు మామిడి పండ్లు డజను రూ.600కు విక్రయించారు. చిన్న సైజు రూ.150కి అమ్మకాలు సాగాయి. సువర్ణరేఖలు రూ.120కి విక్రయించారు. ప్రస్తుతం వైశాఖ మాసం కావడంతో ఈ సీజన్‌లో పండే మామిడి పండ్లను సంప్రదాయంగా దేవుళ్లకు నివేదించి కుటుంబ సభ్యులు వాటిని ప్రసాదంగా సేవిస్తారు. దీంతోపాటు తినడానికి కొనుగోలు చేస్తారు. ఇప్పుడిప్పుడే ఇవి అమ్మకానికి రావడంతో ఎక్కువ ధరకు విక్రయాలు సాగాయి.

పెరిగిన ధరతో దొరకని అల్లం

సంతలో అల్లం కాన రాలేదు. కొనుగోలు చేద్దామంటే ఎవరూ అమ్మకాలు జరపని పరిస్థితి తొలిసారిగా ఏర్పడింది. ఇందుకు ధర ఒక్కసారిగా పెరిగిపోవడమే కారణం. నెల రోజుల క్రితం కిలో అల్లం రూ.30 ఉండగా, అది క్రమేపీ పెరిగి ప్రస్తుతం రూ.200కు చేరుకుంది. దీంతో చిల్లర వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో హోల్‌సేల్ వ్యాపారులు కూడా తీసుకురాలేదని సమాచారం. ఉత్పత్తి తగ్గడమే ఈ పరిస్థితికి కారణమని వ్యాపారులు చెప్తున్నారు.

పెరిగిన టమాట

సంతలో టమాటా ధర గత వారం కంటే కిలోకి రూ.5 పెరిగింది. గత వారం కిలో రూ.10 ఉండగా, ఈ వారం రూ.15కు పెరిగింది.అలాగే క్యారెట్, బీట్‌రూట్ రూ.40 నుంచి రూ.60కి, వెల్లుల్లి రూ.45 నుంచి రూ.60కి పెరిగాయి. ఉల్లిపాయలు రూ.20, బంగాళాదుంపలు రూ.25, వంకాయ, క్యాబేజీ రూ.30, బెండకాయ, దొండకాయ రూ.40, కాకర, బీర రూ.60, క్యాప్సికం రూ.100కు విక్రయాలు సాగాయి.



కశింకోట వారపు సంతలో విక్రయిస్తున్న బంగినపల్లి మామిడి పండ్లు

ఇక కూరల్లో వేసుకునే జీలకర్ర రూ.590 నుంచి రూ.620కి పెరిగింది. గత రెండు రోజులుగా చల్లగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. మధ్యాహ్నం ఎక్కువ ఎండ కాయడంతో కూరగాయల దుకాణాలు కొనుగోలుదారులు లేక వెలవెలబోయాయి. సాయంత్రం ఎండ తీవ్రత తగ్గడంతో యథాధావిధిగా అమ్మకాలు సాగాయి. అలాగే పంచాయతీ ప్రధాన రహదారి ఎండ తీవ్రతతో జన సంచారం తగ్గిపోయింది.

ఏపీజీవీబీ సేవలపై అవగాహన



ఏపీజీవీబీ సేవలను వివరిస్తున్న మేనేజర్ కుప్పిలి శ్రీనివాసరావు

అనకాపల్లి రూరల్ : ఖాతాదారులకు త్వరితగతిన రుణాలు మంజూరు చేయడమే కాకుండా, వివిధ రకాల సేవలు చేరువ చేసినట్టు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ), తుమ్మపాల బ్రాంచ్ మేనేజర్ కుప్పిలి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం మండలంలోని సీతానగరం పాల సేకరణ కేంద్రం వద్ద బ్యాంక్ సేవలపై అవగాహన కల్పించారు. డిపాజిట్లపై ఇతర బ్యాంకులకన్నా అధిక వడ్డీ చెల్లిస్తున్నట్టు తెలిపారు. బంగారు ఆభరణాలపై గ్రాముకు అధిక విలువతో, రుణాలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. గతంలో పంట రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన వారికి, ఇప్పటి వరకూ పంట రుణాలు తీసుకోని వారికి సత్వరమే పంట రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఆరోగ్య బీమాతో పాటు, కేంద్ర ప్రభుత్వ బీమా పాలసీలు అమలు, బ్యాంకు సేవలపై కరపత్రాలను పంచారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ మోటమర్రి శ్రీనివాసరావు, సర్పంచ్ సుంకర చంటి పాల్గొన్నారు.

బ్రైట్ స్వచ్ఛంద సంస్థలో వేసవి శిక్షణ



వేసవి ఉచిత శిక్షణ కేంద్రంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మందపాటి సునీత

తుమ్మపాల : బ్రైట్ స్వచ్ఛంద సంస్థ అనేక సేవా కార్యక్రమాలు చేస్తు ప్రజల మన్ననలు పొందుతోందని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అన్నారు. గాంధీనగరంలోని బ్రైట్ స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యాలయంలో సంస్థ ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ కార్యక్రమాన్ని పట్టణ ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ లక్ష్మీపతితో కలిసి గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి లక్ష్యంగా నిరుద్యోగ యువత, మహిళలకు పలు అంశాల్లో శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. సంస్థ సేవలకు ప్రభుత్వం నుంచి సాయం, సొంత భవనానికి ప్రభుత్వ స్థలం కేటాయించేలా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి తీసుకు వెళ్లనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, సంస్థ వ్యవస్థాపకుడు శివశంకర్, కార్యదర్శి టి.జయశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి'



ఆఫీసు బేరర్ల సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చిన్నబ్బాయ్

అనకాపల్లి రూరల్ : రాష్ట్రంలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యల్ని పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి గొంది చిన్నబ్బాయ్ డిమాండ్ చేశారు. గురువారం అనకాపల్లి సీఐటీయూ కార్యాలయంలో జరిగిన యూటీఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు భద్రతనిచ్చే పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పాత పీఆర్సీ గడువు వచ్చే జూలైతో పూర్తి కానున్నందున వెంటనే 12వ వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు నెల్లి సుబ్బారావు, జిల్లా అధ్యక్షురాలు వత్సవాయి శ్రీ లక్ష్మి, కోశాధికారి జోగా రమేష్, జిల్లా కార్యదర్శులు వి.రమేష్‌రావు, వి.చైతన్య, పీలా శేషుకుమార్, రాష్ట్ర కౌన్సిలర్ ఎల్లయ్యబాబు పాల్గొన్నారు.

శివయ్య సేవలు చిరస్మరణీయం



శివయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

అనకాపల్లిటౌన్ : న్యాయవాది శివయ్య సేవలు చిరస్మరణీయమని ప్రముఖ న్యాయవాది కనిశెట్టి సురేష్‌బాబు అన్నారు. తన కార్యాలయంలో గురువారం శివయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శివయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయి వెంకట లక్ష్మణ్, కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అడపా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్పీని కలిసిన ప్రజాసంఘాలు'



ఎస్పీ మురళీకృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న చిన్నియాదవ్

అనకాపల్లిటౌన్ : శాంతిభద్రల పరిరక్షణకు కృషి చేయాలని ప్రజాసంఘాల నేతలు ఎస్పీని కోరారు. ఈ మేరకు కార్యాలయంలో జిల్లా ఎస్పీ మురళీకృష్ణను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి, అభినందించారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బండి అప్పారావు, వాసుపల్లి తాతయ్యలు, బొబ్బిలి గోవిందరాజు పాల్గొన్నారు.

'వేసవి క్రీడా శిబిరాలను వినియోగించుకోండి'

అచ్యుతాపురం(అనకాపల్లి) : వేసవిలో నిర్వహించే క్రీడా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబురాజు) సూచించారు. అచ్యుతాపురం పోలీస్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. క్రీడాకారులకు క్రీడా సామాగ్రి అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ కోన బుజ్జి, సర్పంచ్ విమలనాయుడు, జెడ్పీటీసీ లాలం రాంబాబు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీటీసీ లాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పునాదులు కోతకు గురికాకుండా చర్యలు

- గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు
- వీఎంఆర్‌డీఏ అధికారులతో కలిసి పైడివాడ లే అవుట్ సందర్శన

సబ్బవరం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన మెగా లే అవుట్‌లోని నిర్మాణాలు కోతకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని గృహ నిర్మాణ శాఖ పీడీ శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని పైడివాడ అగ్రహారంలో ఏర్పాటు చేసిన లే అవుట్‌ను గురువారం ఇరిగేషన్ , వీఎంఆర్‌డీఏ, గృహ నిర్మాణ శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు స్థలాలు కోతకు గురవుతున్నాయని వార్తలు రావడంతో విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున లే అవుట్‌ను పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారన్నారు.

డ్రైన్లు ఏర్పాటు : వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా,నిర్మాణాలు కోతకు గురికాకుండా డ్రైన్లు ఏర్పాటు చేయనున్నట్లు పీడీ తెలిపారు. ప్రస్తుతం నిర్మాణాలకు అవసరమైన మెటీరియల్ తరలించేందుకు రోడ్లు ఏర్పాటు చేయడంతో కొంత గెడ్డ వాగులు దిబ్బతినే అవకాశం ఉందన్నారు. దీనికి అడ్డుకట్ట వేయడానికి రోడ్లకు ఇరువైపులా డ్రైన్లు ఏర్పాటుచేయడం ద్వారా సమస్యను పూర్తిగా పరిష్కరించవచ్చన్నారు. ఈ డ్రైన్లు ఏర్పాటు చేసే సమయంలో వచ్చే గ్రావెల్‌ను నిర్మాణంలో ఉన్న బేస్‌మెంట్‌లు ఫిల్లింగ్ చేసేందుకు ఉపయోగించనున్నట్టు తెలిపారు. అదేవిధంగా లే అవుట్‌ను ఆనుకుని ఉన్న కొండ నుంచి వచ్చే వరదనీటిని నియంత్రించేందుకు కొండ చుట్టూ ట్రెంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. మిగులు నీటిని దిగువనున్న చెరువుకు తరలించేవిధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు.

చురుగ్గా నిర్మాణాలు

పైడివాడ అగ్రహారం లే అవుట్‌లో ఆప్షన్-3 ఎంచుకున్న లబ్ధిదారుల కోసం ప్రభుత్వమే గృహ నిర్మాణాలు చేపట్టింది. గృహ నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. లే అవుట్‌లో కోతకు గురైన బేస్‌మెంట్‌లను పరిశీలించినవారిలో సర్పంచ్ వడ్డాది అప్పలరాజు, వీఎంఆర్‌డీఏ ఈఈ ప్రసంగరాజు,అధికారులు శివప్రసాద్, బలరాం రాజు, రాంబాబు, ఇరిగేషన్ ఏఈ రామలక్ష్మణ పాల్గొన్నారు.